ప్రజాశక్తి
శుక్రవారం 19 మే 2023
5
శ్రీ సత్యసాయి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్నికల కమిషనర్ ఆదేశాలు పాటించాలి


కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికల కమిషన్ ఆదేశాలను జిల్లా అధికారులు తూచా తప్పకుండా పాటించి, వారి సూచించిన అన్ని పనులను అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. గురువారం విజయవాడ నుంచి పెండింగ్‌లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములు, కొత్త రివైజ్డ్ వర్షన్, వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లలతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సత్యసాయి కలెక్టరేట్లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములు త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగా రివైజ్డ్ వర్షన్ ఈఆర్ఓ.నెట్ 2.0కు సంబంధించి ఎలాంటి అనుమానాలు, ఉన్న సమస్యలు తెలియజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ కొత్త వెర్షన్లో డేటా ఎంట్రీ పూర్తయ్యాక ఎపిక్ నెంబర్లు డిస్‌ప్లే కావడం లేదని, ఫామ్-7లో పోలింగ్ స్టేషన్ వివరాలు కనిపించడం లేదన్నారు. నోటీస్ నెంబర్లు 13, 14 జనరేట్ కావడం లేదని ఎన్నికల అధికారికితెలియజేశారు. అనంతరం ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడారు. 6,7,8 ఎన్నికల కమిషన్ రూల్స్ ప్రకారం పాటించి సమగ్ర విచారణ జరిపి క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని తెలిపారు. బిఎల్‌వోలు ప్రొఫార్మా తప్పులు లేకుండా నమోదు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు, దీనిపై తహశీల్దార్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, మడకశిర నియోజకవర్గాల సహా ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, చిన్నయ్య, ఆనంద్, మైనావుద్దీన్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ నేతన్న నేస్తం ఏటా సన్నగిల్లుతోంది. ఏడాదికేడాది లబ్ధిదారుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతూపోతోంది. వ్యవసాయం తరువాత అత్యధికంగా ఆధారపడిన రంగం ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత. సుమారు ఐదు లక్షల వరకు ఈ రంగం ఆధారపడి జీవనం సాగించేవారు. ఇటీవల చేనేత రంగం పవర్ లూమ్స్ దెబ్బతో కుదేలు అయ్యింది. వృత్తిలో ఆదాయం లేక అనేక మంది ఈ రంగం నుంచి బయటకు పోతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ సహకారం ప్రోత్సాహం తగ్గుతూవస్తోంది.





సన్నబడుతున్న నేతన్ననేస్తం

- ఏటా తగ్గుతున్న లబ్ధిదారులు
- నిబంధనల పేరుతో కొర్రీలు
- ఎన్నికల ముందు ఒకలా.. తర్వాత మరోలా.!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు చేనే పట్టు కొనుగోళ్లకు రాయితీ ఉండేది. వైసిపి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక ఆ రాయితీని ఎత్తివేసి ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలను వైఎస్ఆర్ నేతన్న నేస్తం పేరుతో అందించే పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద చేనేత కుటుంబానికి సంవత్సరానికి రూ.24వేలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. ప్రారంభమైన నాలుగు సంవత్సరాల్లో చూస్తే ఈ పథకం కింద లబ్ధిపొందుతున్న వారి సంఖ్య తగ్గుతూపోతుండటం గమనార్హం.

అనంత పరిధిలో నాలుగేళ్లలో తగ్గిన లబ్ధిదారులు 2274 మంది

అనంతపురం జిల్లా పరిధిలో నాలుగేళ్ల కాలంలో చూస్తే లబ్ధిదారుల సంఖ్య ఏకంగా 2274 మంది తగ్గిపోయింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 10525 మంది లబ్ధిదారులున్నారు. వీరికి రూ.25.26 కోట్లు మంజూరయ్యాయి. 2020-21 సంవత్సరంలో 8821 మంది లబ్ధిదారులు తగ్గిపోయారు. రూ.21.17 కోట్లు మంజూరయ్యింది. 2021-22 సంవత్సరంలో 7360 మంది లబ్ధిదారులకు రూ.17.66 కోట్లు నేతన్న నేస్తం సాయం అందించారు. 2022-23వ సంవత్సరంలో 8251 మంది లబ్ధిదారులకు రూ.19.80 కోట్లు అందజేశారు. ప్రారంభమైన సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చూస్తే లబ్ధిదారలు సంఖ్య సుమారు 22 శాతానికిపైగా తగ్గడం గమనార్హం.

సత్యసాయి జిల్లాలోనూ తగ్గుముఖమే

అనంతపురం జల్లాలో కంటే సత్యసాయి జిల్లాలో చేనేత కార్మికులు అధికంగానున్నారు. ప్రధానంగా ధర్మవరం, సోమందేపల్లి, హిందూపురం ప్రాంతాల్లో చేనేత మగ్గాలు అధికంగానున్నాయి. ఈ జిల్లాలో 2019-20 సంవత్సరంలో 16813 మంది చేనేత కార్మికులకు రూ.40.35 కోట్లు నేతన్న నేస్తం అందింది. అదే 2020-21 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి లబ్ధదారుల సంఖ్య 14,640 కి తగ్గింది. వీరికి రూ.35.14 కోట్లు నిధులు అందజేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 14,244 మంది లబ్ధిదారులకు రూ.34.14 కోట్లు మంజూరు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 14,973 మంది లబ్ధిదారులకు రూ.35.93 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇలా నాలుగేళ్లలో రెండు జిల్లాల పరిధిలోనూ 4114 లబ్ధిదారులు తగ్గిపోయారు. ఇలా ఏటా లబ్ధిదారులు తగ్గిపోతూ ఉన్నారు. దీనికి అధికారులు వివిధ కారణాలు చూపుతుండటం గమనార్హం. చేనేత కార్మిక సంఘం నాయకులు మాత్రం చేనేతలందరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నరు. బాడుగ మగ్గాల మీద అనేక మంద నేస్తున్నారని, వీరందరికీ ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



సిఐతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాలని ధర్మవరం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్లో సిబ్బంది కొరత, కేసుల వివరాలను సిఐ సుబ్రమణ్యంను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వన్‌టౌన్ పరిధిలో ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయాలని, ముఖ్యంగా పేకాట, గుట్కా, మట్కా, గంజాయి తదితరవాటిపై ప్రత్యేక నిఘాఉంచాలని సిఐని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమద్‌రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిమడుగులో ఉద్రిక్తత



జెసిబితో తొలగిస్తున్న ఆక్రమణలు

పోలీసు సమక్షంలో దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి-కనగానపల్లి

మండల పరిధిలోని తల్లిమడుగు గ్రామంలో గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన టీ దుకాణాలను పోలీసుల సహాయంతో రోడ్లు భవనాలు శాఖ అధికారులు గురువారం తొలగించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో ఎక్కువ దుకాణాలు టీడీపీ సానూభూతిపరులు ఏర్పాటు చేసుకొని జీవనంసాగిస్తున్నారు. అయితే అధికార పార్టీ నాయకులు మాట విని కక్షపురితంగా టీడీపీ సానుభూతిపరుల దుకాణాలను మాత్రమే తొలగించారని బాధితులు ఆరోపించారు. దీంతో రోడ్లు భవనాలు శాఖ అధికారి నిహారిక ఇరు పార్టీల సానుభూతి పరుల టీదుకాణాలను తొలగిస్తామని చెప్పారు. అయితే ఆర్ అండ్ బి స్థలంలో వున్న ఇల్లు, షాపులు అన్ని కూడా తొలగించాలని టీడీపీనాయకులు పట్టు బట్టారు. దీంతో అధికార పార్టీ నాయకుల రంగప్రవేశం చేసి అధికారులు లపై ఒత్తిడి పెంచారు. దీంతో వైసీపీకి సంబందించిన వారి షాపులు కేవలం రెండు మాత్రమే తొలగించి మిగిలినవాటినన్నిటిని వదిలేచడంతో సమస్య మళ్ళీ మొదటికివచ్చింది. దీంతో తల్లి మడుగు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దుకాణాలు సమస్య రాజీకీయ పార్టీ లు సమస్యగా మారిందని స్థానికులు నుంచి విమర్శలు విని పిస్తున్నాయి.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పారిశుద్ధ్యంపై సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అధికారులను, కార్మికులను హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం వివిధ వార్డుల్లో పర్యటించారు. 1వ వార్డులోని ఉద్యానవనాన్ని పరిశీలించారు. ఉద్యానవన అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కమిషనర్ తన ఛాంబర్‌లో పారిశుధ్యంపై పర్యవరణ ఇంజనీర్ నాగేంద్ర, మేస్త్రీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం మెరుగు పర్చడంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు ఇవ్వడం లేదు సార్...!



చిలమత్తూరు మండలంలో కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు



పుట్టపర్తిలో మహాధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, కూలీలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చేసిన ఉపాధి పనులకు సక్రమంగా బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి ఉంటోంది. ఎప్పుడు చేసిన పనులకు అప్పుడు బిల్లులు చెల్లిస్తే కుటుంబ పోషణకు ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికీ ఇంకా 6 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తక్షణం వీటిని చెల్లించాలి' అంటూ ఉపాధి కూలీలు వ్యకాసం నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని చాగలేరు పంచాయతీలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నాయకుల ఎదుట వారి సమస్యలను ఏకరువు పెట్టారు. 6 వారాల కు సంబందించిన బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అలాగే రోజు వారి కూలి 275 రూపాయలు చెల్లించాల్సి ఉండగా 180 మాత్రమే చెల్లిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. కూలీలకు పేస్లిప్‌లు పంపిణీ చేయడం లేదన్నారు. వందరోజులు పూర్తి చేసుకున్న కూలీలకు పనిముట్లు పంపిణీ చేయలేదని చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక చోట్ల కూలీలు వడదెబ్బకు గురవుతున్న సంఘటనలు చూస్తున్నామని అయితే పని ప్రదేశాలలో మజ్జిగ,మంచినీరు, టెంట్లు కనిపించడం లేదని వాపోయారు. ఈసమస్యలన్నింటిపై ఈ నెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు పనిదినాలు కల్పించాలి

పుట్టపర్తి రూరల్ : వంద రోజులు పనులు పూర్తి చేసిన ఉపాధి కూలీలకు అదను పనిదినాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం పుట్టపర్తి, కొత్తచెరువు, మండలాలలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాలను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల సమస్యలపై ఈనెల 22న కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందుకు సంబందించిన కరపత్రాలను ఈసందర్భంగా పంపిణీ చేశారు. అనంతరం

వ్యకాసం నాయకుల ఎదుట కూలీల ఆవేదన

ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదార్లకు, కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల సబ్సిడీలు ఇస్తూ పేదలకు నిధులు తగ్గించడం బాధాకరమన్నారు. ఒకే సారి ఉపాధి చట్టాన్ని రద్దు చేస్తే పేదలు తిరగబడతారనే భయంతో ఈ పథకంలో అనేక షరతులు పెట్టి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఒక పూట బదులు రెండు పూటల పని చేయాలని ఒత్తిడి చేసి, సమ్మర్ అలవెన్స్ రద్దు చేశారన్నారన్నారు, తాగునీటికి, పార, తట్ట, గడ్డపార పదునుకు ఇచ్చే డబ్బులు నిలిపి వేసి ఆన్లైన్ మస్టర్లు పెట్టి పేదలను హింసకు గురి చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయించుకోవాలంటే కార్మికులందరూ ఐక్యమై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న జరిగే ధర్నాలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓ హెచ్చరిక చేయాలన్నారు. ఉపాధి చట్టంలో పని చేసే కార్మికులకు కొలతలు ప్రకారంగా వేతనాలు ఇస్తారే తప్ప రోజు కూలి కాదనీ ఎన్ని గంటలు పని చేయాలని నిబంధన లేదనీ పొద్దు పుట్టకనే పనికి వెళ్ళి 11గంటల తరువాత ఇళ్ళకు చేరుకుంటున్నారని అన్నారు. దీనిని చూసి పెత్తందార్లు తట్టుకోలేక కూలీలపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధిచట్టం ఉంటే పెత్తందార్ల మాట చెల్లుబాటు కావడం లేదని ఈ చట్టాన్ని రద్దు చేయాలని గోల చేస్తున్నారనీ వీరి మాటలకు తలొగ్గిన బిజెపి ప్రభుత్వం అనేక షరతులు పెట్టి మనమే పని మానుకునేలా కుట్రలు చేస్తోందని అన్నారు. ఈ చర్యలను ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, శాంతమ్మ, గంగావతి, ఉమాదేవి, సరోజమ్మ, లక్ష్మీదేవి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి అమడగూరు

కదిరి మున్సిపాలిటీలోని రైల్వే స్టేషన్ రోడ్డు నందు నివాసముండే మాజీ మున్సిపల్ చైర్మన్ భర్త వేముల ఫయాజ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దా రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఫయాజ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

గ్రంథాలయంలో బాలలకు వినోదం

ప్రజాశక్తి అమడుగూరు

అసలే పిల్లలకు పాఠశాలలు సెలవులు, వీటికి తగ్గట్టుగా సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా విద్యార్థుల్లో చదివేశక్తి పెంపొందించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో పిల్లలకు వినోదం, విజ్ఞానం, వికాసం పెంచే విధంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలతో పలు పాఠ్యపుస్తకాలను, కథల పుస్తకాలను చదివించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించారు గ్రంథాలయ కార్యదర్శి ఇబ్రహీం ఆధ్వర్యంలో పిల్లలకు వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

అభివృద్ధిపై అధికారుల సమీక్ష

ప్రజాశక్తి అమడగూరు

మండల స్థాయిలో ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో నరసింహులు ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ భాను ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అనిల్ కుమార్, అమరావతి ,గోపాల్, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

ఉద్రిక్తంగా మారిన ఇటుకలబట్టీ వ్యాపారి మృతి

నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- పరిగి

విద్యుత్ అధికారులు విధించిన జరిమానాకు ఒత్తిడికి గురైన ఇటుక బట్టే వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తి గుండెపోటుకు గురై మృతిచెందడంతో మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అందుకు సంబంధించిన వివరాలు... పరిగి మండలం కాలుపల్లికి చెందిన బీరప్ప ఇటు రైతుగా పని చేస్తూ మరో ప్రక్క ఇటుక బట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తూ ఉండేవాడు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ అడ్వకేట్ ఇటుక బట్టీలు నిర్వహించరాదని దీనివల్ల గ్రామం కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల ఇటుక పట్టి వ్యాపారం పనితీరుపై స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ జరిపారు. బీరయ్య నిర్వహిస్తున్న వ్యాపారానికి ప్రభుత్వ కరెంటు వినియోగిస్తూ ఉన్నాడని అభియోగంతో రూ 1.93లక్షల జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుపై ఆందోళన చెందిన బట్టి వ్యాపారి వీరయ్య బుధవారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. దీంతో బంధువులు హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గ్రామానికి చెందిన మనోహర్ అనే వ్యక్తి ఫిర్యాదు వల్లే బీరయ్య మృతిచెందాడని మృతుని కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని ఫిర్యాదుదారుడి ఇంటి ముందు ఉంచి రాత్రి 12 నుండి గురువారం ఉదయం 10 గంటల వరకు ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని బాధితులక నచ్చజెప్పారు. అయినా వారు వినలేదు. బీరయ్య మృతికికారణమైన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని తెగేసి చెప్పారు. హిందూపురం డిఎస్‌పి కంజక్షన్ ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో స్థానికులతో హిందూపురం సిఐలు కృష్ణారెడ్డి, కరుణాకర్, ముగ్గురు ఎస్ఐలు చర్చించారు. బీరయ్య మృతికి కారకులైన మనోహర్, సిద్ధరాజ్, ముద్ద గంగప్ప , హరిలపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు మృతదేహాన్నిహిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే తన ఇంటి లోని విలువైన వస్తువులను గ్రామస్తులు ధ్వంసం చేసి తనపై దాడి చేశారని అడ్వకేట్ మనోహర్ సైతం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

క్రికెట్ టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు

ధర్మవరం టౌన్ : పరిటాలరవీంద్ర మెమోరియల్ ట్రస్టు ధర్మవరం, రాపాడు సూపర్ లీగ్ క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం టీడీపీ నాయకులు క్రీడామైదానాన్ని చదును చేయించారు. పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్ల ఎదురుగా ఉన్న మైదానాన్ని రోలర్ తో మట్టిని చదును చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు ఫణికుమార్, రాంపురంశీన, కేశగాళ్ల శ్రీనివాసులు, గంగారపురవి, బొట్టుకి, పటాన్ బాబుఖాన్, ఓంప్రకాశ్, విజయ్ చౌదరి, సుధాకర్‌నాయుడు, హేమరాజు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

పుట్టపర్తి అర్బన్ : భగభగ మండే ఎండలో రోజు పలువురికి చల్లని మజ్జిగ ఇస్తూ కొండంత ఊరటనిస్తున్న సత్యసాయి భక్తురాలు సౌజన్యలత సేవను పలువురు అభినందిస్తున్నారు. గురువారం సాయి టవర్ హోటల్, అపార్ట్మెంట్ దగ్గర దారిన వెళ్లే వారికి చల్లని మజ్జిగ ఇచ్చి ప్రశంసలను అందుకుంటున్నారు.

అడిషనల్ క్లాస్ రూంలు, తరగతి గదులు

తగ్గించేందుకు కుట్ర..!

ప్రజాశక్తి - చిలమత్తూరు

నాడు నేడు పథకానికి పాఠశాలలను ఎంపిక చేయడంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. చిలమత్తూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉన్న అడిషనల్ క్లాస్ రూంల సంఖ్య ను తగ్గించేందుకు డిఇఒ మీనాక్షి గురువారం పరిశీలించారు. గదుల సంఖ్య, విధ్యార్థుల సంఖ్యను బేరేజు చేసి ఉన్న గదులు సరిపోతాయని తేల్చారు. దీనిపై తమ అభిప్రాయాలను తెల్పాలని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీని ప్రదానోపాధ్యాయులు జయప్రదకు కోరారు. గతంలో ఈ పాఠశాలలో తరగతి గదులు తక్కువగా ఉన్నందున ఆర్డీటీ వారు నిర్మాణం చేశారు. అలాగే నాబార్డు కింద మరిన్ని గదుల నిర్మాణం జరిగింది. దీంతో పాఠశాలకు సరిపడ గదులు నిర్మాణం అయ్యాయి. దీనికి తోడు రెండవ విడతలో నాడు నేడు క్రింద మరో 8 గదులు మంజూరు చేశారు ఆలస్యంగా అన్ని తరగతి గదులు అవసరం లేదని జిల్లా విద్యాశాఖ గుర్తించింది. ఇంకో రెండు గదులు అయితే సరిపోతాయని 8 అవసరం లేదని తేల్చారు. అయితే ఇప్పటికే స్కూల్ కమిటీ కాంట్రాక్టర్ మెటీరియల్ కొనుగోలు చేసినట్లు తెలియడంతో 8 కడతారా లేక 2 తో సరిపెడతారా చూడాలి. అయితే గదులు సంఖ్య తక్కువగా ఉండి చెట్ల క్రింద చదువులు కొనసాగిస్తున్న కొడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాత్రం మరమ్మతులతో అధికారులు సరిపెట్టారు. అలాంటి చోట గదులు నిర్మాణం చేస్తే అక్కడి పాఠశాల విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పెనుకొండ

ఆటో కార్మికుల సమస్యలపై ఈనెల 23వ తేదీన శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న బాబా, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ వారం రోజుల నుండి ఆటోలపై పోలీసు వేధింపులు తీవ్రతరమయ్యాయని అన్నారు. ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో కొద్దిమందికి మాత్రమే 10వేల రూపాయలు ఇచ్చి సంవత్సరానికి ఈ చలాన రూపంలో వేల రూపాయలను ప్రభుత్వానికి దోచుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు బలవంతంగా కేసులు పెట్టుతున్నారన్నారు. అనేక మంది నిరుద్యోగులు డిగ్రీ ,పీజీలు చేత పట్టుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఆటోలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితిలో కొత్తగా జీవో నెంబర్ 290తో కేసులు పెట్టి ఆటోలను పోలీస్ స్టేషన్ తరలించే పరిస్థితి నెలకొందన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై ఈనెల 23వ తేదీన సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు ఆటో కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పైపల్లి గంగాధర్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, మహబూబ్‌బాషా, ఆటో కార్మికుల యూనియన్ నాయకులు వజ్రం నాగప్ప, హనుమంతు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ యంత్ర సేవ' ప్రారంభం

ప్రజాశక్తి అమడగూరు

కదిరి రూరల్ మండలం కదిరి బ్రాహ్మణపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో కదిరి బ్రాహ్మణపల్లి కస్టం హైరింగ్ సెంటర్‌కు వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం క్రింద మంజూరైన ట్రాక్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధా రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒక కస్టం హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఈ సెంటర్ ద్వారా ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ వ్యవసాయ పనిముట్ల ద్వారా రైతులు దుక్కి నుండి నూర్పిడి వరకు అవసరమైన వాటిని ఉపయోగించుకొనే వెసులుబాటు కల్పించారన్నారు. అంతేకాకుండా రైతులకు అవసరమగు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంతో పాటు, ఎరువులను రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ ధరలతో అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యంత్రసేవ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నిర్వాసితులకు పరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి బత్తలపల్లి

అనంతపురం- కదిరి జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోయిన పలువురు రైతులకు సంవత్సరాలు గడుస్తున్న పరిహారం అందడం లేదని ఈ విషయంలో న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ యుగేశ్వరీదేవికి గురువారం అందజేశారు. ఈసందర్భంగా రాప్తాడు- బత్తలపల్లి నాలుగు వరసల రహదారి నిర్మాణానికి భూములు కోల్పోయిన బాధిత రైతులు మాట్లాడుతూ 2018 సంవత్సరంలో రాప్తాడు నుండి బత్తలపల్లి వరకు నాలుగు వరుసల రహదారి నిర్మించారని వీటి కొరకు భూములు కోల్పోయిన పలువురు రైతులకు భూ పరిహారం అందిందని అన్నారు. మరికొందరి రైతులకు నేటికీ పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా 2.53 ఎకరాల భూమికి సంబందించిన పరిహారం మంజూరయ్యే లిస్టులో మిస్సింగ్ జరిగిందని, వెంటనే ఈ విషయమై జాతీయ రహదారుల అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. మిస్సింగ్ సర్వే నెంబర్లను 2021లో కేంద్ర ప్రభుత్వం దృష్టికి పంపామని అక్కడ అధికారులు అప్రూవల్ చేస్తేనే పరిహారం విడుదలవుతుందనిజాతీయ రహదారుల శాఖ అధికారులు చెబుతున్నారని బాధిత రైతులు వివరించారు. మార్కెట్లో సెంటు భూమి ధర లక్షల రూపాయల్లో ఉండగా అధికారులు అందిస్తున్నది కేవలం సెంటు భూమికి రూ. 30వేలు మాత్రమేనని అన్నారు. అది కూడా సంవత్సరాలు గడుస్తున్నా విడుదల చేయలేదని వాపోయారు. తమ భూములలో రహదారి నిర్మించుకొని దాదాపు నాలుగు సంవత్సరాలు కావస్తున్న పరిహారం మాత్రం నేటికీ విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. పరిహారం వెంటనే విడుదల చేయకపోతే తమ భూములలో వాహనాలు తిరగకుండా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

అమడగూరు : నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కదిరి మండల విద్యాశాఖ అధికారి చెన్నకృష్ణకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జాన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఉపేంద్ర మాట్లాడుతూ కదిరి పట్టణంలో మే 14న శ్రీ చైతన్య స్కూల్ సిబ్బంది పాంప్లెట్లు పంచుతూ ఇంటింటికి తిరిగి అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నా నిర్వహించినా పాఠశాల యాజమాన్యం యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గొల్లపల్లిలో నిర్వహించిన గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర్ నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచి రామాంజనేయులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాల్గొన్న పలువురు నాయకులు : గోరంట్ల మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు పలువురు నాయకులు పాల్గొన్నారు. వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, వాల్మీకి రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి , పాపిరెడ్డి పల్లి బోర్ వెల్స్ రాము పాల్గొన్నారు. వీరికి ఆలయ నిర్వహకులు , గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూల మాలలు వేసి దుశావాలతో సన్మానించారు .ఈ సందర్భంగా వారు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుగానిపల్లి అంజి, చిన్నారపు పల్లి కుల్లయప్ప, శ్రీనివాసులు, నరసింహప్ప , చింతకాయల అంజి, గొల్ల లక్ష్మీనరసు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గోరంట్ల రూరల్: మండలం పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన రామంజినమ్మ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసినట్లు వైసిపి నాయకులు తెలిపారు. రామాంజినమ్మ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందిందన్నారు. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబానికి తక్షణ సాయం కింద పదివేల రూపాయలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలసముద్రం సర్పంచి గంగప్ప, ఎంపీపీ ప్రమీల మూర్తి, సచివాలయం కన్వీనర్ గోవింద్ రెడ్డి, వార్డు మెంబర్ ఆదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ లోకేష్, వాలంటీర్ చంద్రశేఖర్ రెడ్డి, మంజునాథ్, పుర బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు పరిశీలన

బత్తలపల్లి : వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపిడిఒ శ్రీదేవి, ఎంఇఒ చాముండేశ్వరి పరిశీలించారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిల్వ వుంచిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింటును వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, వారికి ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలు ఎన్ని వచ్చింది, బెల్టులు కొలతల మేరకు వచ్చాయా లేదా అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి అన్ని రకాల వస్తువులతో కూడిన కిట్లను అందించాలన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నల్లచెరువు : మండల పరిధిలోని పోలేవాండ్లపల్లి కి చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్త బి. శంకర అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజ శేఖర్,కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

ఓబుల దేవర చెరువు : మండలంలోనిఅల్లాపల్లి పంచాయతీ పగడాల వారి పల్లికి చెందిన టిడిపి కార్యకర్త పూజారి రమణప్ప గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పశుగ్రాసాన్ని సమకూర్చుకోవటానికి ఆర్థికసాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు నిజాం వలి, తెలుగు యువత కార్యదర్శి మీ సేవ సుధాకర్, నాయకులు కృష్ణమూర్తి, పలక గంగన్న, తెలుగు యువత అధికార ప్రతినిధి మాదినేని మురళి, హరికృష్ణ, పీట్ల రమణ, శేషు, అంజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలో చేపట్టిన నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపిడిఒ శ్రీదేవి కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ మేరకు ఆమె గురువారం మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందులో భాగంగానే నాడు నేడు కింద కోట్లాది రూపాయలు వెచ్చించి క్లాస్ రూంలు, మరుగుదొడ్లు నిర్మిస్తోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మిస్తోన్న అదనపు తరగతి గదులకు నాలుగు రోజుల క్రితం స్లాబ్ వేసినట్లు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మహమ్మద్ జాన్ ఎంపిడిఒకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చాముండేశ్వరి, సీఆర్పీలు రమణ, సునీత, ఇంజనీరింగ్ సహాయకురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనుల గురించి ఆరా తీస్తున్న ఎంపిడిఒ

రీ సర్వే ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో రీ సర్వే పనులు నిర్ణీత గడువులోపు వేగవంతంగా పూర్తి చేస్తామనికలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో రీ సర్వే, ఇంటి స్థలాలు, గృహ నిర్మాణాలు, పర్యాటక, వ్యవసాయ అనుబంధ శాఖలతో జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డి ఆర్ఒ కొండయ్య పాల్గొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి అయ్యే దిశగా వేగవంతం చేయాలన్నారు. జగనన్న లేఅవుట్లలో తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం వచ్చే సమయానికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న జగనన్న భూహక్కు భూ రక్ష రెండవ దశ త్వరగతిన పూర్తిచేసి హక్కు పత్రాలు రైతులకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి దశ రీ సర్వే పూర్తి అయిన భూములకు రాళ్లు పాతే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖపై కలెక్టరు సమీక్షిస్తూ వైఎస్ఆర్ సేవా పథకం క్రింద రైతులకు తక్కువ అద్దెతో బాడుగకు ఇవ్వాలని, ఆర్‌బికె స్థాయిలో నిర్వహణ చేయాలని అన్నారు. జగనన్న పాల వెల్లువ క్రింద రిజిస్టర్ అయిన రైతులకు చేయూత పథకం ద్వారా పాడిపశువుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన గడువులోగా అధికారులందరూ సమిష్టిగా పనిచేసి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు, సిరికల్చర్ జెడి పద్మమ్మ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలకు డిమాండ్



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ముందస్తు అడ్మిషన్లను చేపడుతున్న నారాయణ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా యూకేజీ నుండి పదవ తరగతి వరకు రూ.26 వేల నుంచి 40వేల రూపాయల వరకు విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అయితే విద్యార్థులకు క్రీడా మైదానం, మౌలిక సదుపాయాలు కూడా సరిగా కల్పించ లేదన్నారు. ఫీజులతో పాటు ఇక్కడే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బుక్స్, టైలు కొనాలని నిబంధన పెట్టి రూ. 6 నుంచి 12వేల రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చిన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇటీవల ఫీజు నియంత్రణ చట్టం తీసుకోచ్చి, దీని కోసం జీవో నెంబరు 53ను విడుదల చేసిందన్నారు. దీనిని అనుసరించి ప్రాథమిక విద్యకు రూ.11వేలు, ఉన్నత విద్యకు రూ.15వేలు ఫీజులు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ నిబందనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. అయితే విద్యాశాఖ అధికారులు మాముళ్లు తీసుకుని వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబందనలు అతిక్రమిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోక పోతే ఆలాంటి విద్యా సంస్థలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేపడుతామని హెచ్చరించారు. దీనికి విద్యాశాఖ అధికారులే భాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, నిహాల్, నవీన్, మహేష్, లిఖిత్, ఆదర్శ్, సిరాజ్, నందీష్, భాను, తేజ, అనిల్ కుమార్, రాజేష్, షాహిద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-3లో బేల్దారి చాకలి నరసింహులు (36) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-3కి చెందిన కోడెకండ్ల నరసిం హులు బేల్దారిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే నరసింహులు తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తరచూ నరసింహులు భార్యతో గొడవపెట్టుకునేవాడు. ఈ క్రమంలో భర్త వేధింపులు తాళలేక ఆయన భార్య శోభ పుట్టినిల్లు అయిన బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి వెళ్లింది. అంతకు ముందుగా నరసింహులు కూడా ఇంటిలో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆరునెలల తరువాత జీవిత కాలంలో తిరిగి ఇంటికి వచ్చాడు. తల్లిని తాగేందుకు నరసింహులు డబ్బులు అడుగుతూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో నరసింహులు గురువారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ జమేదార్ సూర్యనారాయణ సంఘటనాస్థలానికి పరిశీలించారు. మృతుని భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రొద్దం : మండలంలోని పాత్రపల్లి సమీపంలో రెండునెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గురువారం మృతిచెందాడు. గుట్టూరు ప్రభుత్వ వైద్యశాలలో కాంపౌండర్ గా వీధులు నిర్వహిస్తున్న రొద్దం ఫక్రుద్దీన్ (58) రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. మూడు నెలల పాటు చికిత్స తీసుకోవాలని వైద్యులు చెప్పారు. అయితే చికిత్స తీసుకుంటున్న ఫక్రుద్దీన్ గురువారం మృతి చెందాడు.

విద్యార్థి ఆత్మహత్య

పెనుకొండ : మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన ఎం. అనిల్ కుమార్(15)అనే విద్యార్థి పదవ తరగతి ఫలితాల్లో మార్కు లు తక్కువ వచ్చాయని బాధతో తన ఇంటిలో ఎవ్వరూ లేని సమయములో గురువారం ఇంట్లోని కప్పుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది.తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు పెనుకొండ పి ఎస్. హెడ్ కానిస్టేబుల్ కే.దాదాపీరా కేసు నమోదు చేసి అనిల్ కుమార్ మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి

పరిగి : మండలంలోని మోద మహర్ష స్టీల్ ఫ్యాక్టరీలో విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... చిక్‌బల్లాపూర్ జిల్లా చెందిన వలస కార్మికుడు నిజాముద్దీన్ ఖాన్ ఉదయం 6 గంటల సమయంలో గ్రామం నుంచి పనికి వచ్చాడు. ఫ్యాక్టరీ లోపల పై భాగంలో వెల్డింగ్ చేస్తూ విద్యుత్ లైను తాకడంతో పైనుండి క్రిందికి పడ్డాడు. వెంటనే తోటి కార్మికులు గమనించి హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అయితే నిజాముద్దీన్‌ఖాన్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పెనుగొండ సిఐ కరుణాకర్ ఫ్యాక్టరీ కి చేరుకునే సంఘటనపై విచారణ చేశారు. మృతునితల్లి మోసిన్ తాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : కదిరి పట్టణంలోని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కందికుంట నివాసం లో కందికుంట సమక్షంలో కదిరి రూరల్ మూలపల్లి తండాకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. తండాకు చెందిన గణేష్ నాయక్, బాలాజీ నాయక్, అంజినేయులు నాయక్ ,రవి నాయక్ ,ఉత్తన్న నాయక్, రవీంద్ర నాయక్ తదితరులు టిడిపిలో చేరారు. వారికి కందికుంట పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో కదిరి రూరల్ మండల నాయకులు గంగులప్ప ,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అమడగూరు : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మండల పరిధిలోని కదిరి బ్రాహ్మణపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి, చెర్లోపల్లి, వీరచిన్నయ్యగారిపల్లి దిన్నేమీదపల్లి గ్రామాలలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్‌తో పాటు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల కడుపుకొట్టిన వైసీపీ

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో అన్నాక్యాంటీన్లను మూసి వేయించిన వైసీపీ ప్రభుత్వం పేదల కడుపుకొట్టిందని టీడీపీ నాయకులు విమర్శి:చారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు 40వరోజు గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద పేదలకు అన్నాక్యాంటిన్ వద్ద టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. ఈఅన్నదాన కార్యక్రమాన్ని శ్రీశైలంజయనాగలక్ష్మి జయంతి సందర్భంగా సహాయసహకారాలు అందించిన కుటుంబ సభ్యులు శ్రీశైలం గురుస్వామిగౌడ్, గౌడ్, శ్రీశైలం విశాలైడ్డలను టీడీపీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, హోటల్ మారుతీస్వామి, రామకృష్ణ, మహేశ్, చెలిమిశివరాం పాల్గొన్నారు.

విత్తన వేరుశనకు పేర్లు నమోదు చేసుకోండి

గోరంట్ల రూరల్ : సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం మండల పరిధిలోని రైతులు గురువారం నుండి ఆయా రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి యస్.మహబూబ్ భాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె - 6 రకం 4387 క్వింటాళ్లను మండలానికి కేటాయించారని చెప్పారు.

మగ్గం పరికరాలు పంపిణీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శాంతినగర్లో ఎస్సీ చేనేత కార్మికులకు మగ్గం పరికరాలను చేనేత జౌళిశాఖ సత్యసాయిజిల్లా ఏడీ రమేష్ గురువారం పంపిణీచేశారు. జాతీయ చేనేత అభివృద్ధి పథకంలోని హెచ్ఎస్ఎస్ ఆంశంకింద 48 మంది ఎస్సీ చేనేత కార్మికులకు మోటారు లిస్టింగ్ మిషన్లు, 6 మగ్గాలను పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మీ, నాయకులు చెలిమి పెద్దన్న, జింక కంబగిరి తదితరులు పాల్గొన్నారు.



మగ్గం పరికరాలను అందజేస్తున్న దృశ్యం

ముడుపులు ముట్టలేదు.. వీధిదీపాలు వెలగలేదు...

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పెనుకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వీధిదీపాలు వెలగడం లేదు. నూతనంగా వీధిదీపాలు ఏర్పాటు చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదు. దీంతో వాటిని ప్రారంభించలేదు. ఈ పనుల నిర్వహణకు ముడుపులు ఇవ్వకపోవటంతోనే బిల్లుల మంజూరు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం పురపాలక సంఘం అభివృద్ధిలో భాగంగా పెనుకొండ రోడ్డులో ప్రధాన రహదారిలో డివైడర్లను ఏర్పాటు చేసి, పాత విద్యుత్ దీపాల స్థానంలో సుమారు రూ.40లక్షలు వెచ్చించి, 35 విద్యుత్ స్తంభాలకు 70 వీధిదీపాలను అమర్చే విధంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ పనులను గుత్తేదారులకు అప్పగించారు. పనులు తీసుకున్న గుత్తేదారులు అన్ని స్తంభాలకు విద్యుత్ దీపాలను అమర్చి సుమారు మూడు నెలలు పూర్తి అయింది. అయితే ఇప్పటి వరకు అవి వెలగలేదు. దీంతో ప్రధాన రహదారి చీకటిగా మారినప్పటికి ఏ ఒక్కరు పట్టించు కోవడం లేదు. దీనికి ప్రదాన కారణం రూ.40లక్షలకు కమిషన్ ఇవ్వక పోవడంతోనే వాటి బిల్లులు మంజూరు చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు, పాలకులు పట్టించుకుని వీధిదీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వీధి దీపాలు వెలగక పోవడంతో చీకటిగా మారిన ప్రధాన రహదారి